క్లుప్తంగా

ఎంపీడీఓ బదిలీ

మెరకముడిదాం: ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పి.రామకృష్ణ పదోన్నతిపై గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన ఈఓపీఆర్డీగా, ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా గత కొన్నేళ్లుగా జిల్లాలో సేవలందించారు. ఆయన స్థానంలో కొత్త ఎంపీడీఓ రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

ఇసుక నిల్వల వేలం

చీపురుపల్లి: మండలంలోని గొల్లలపాలెం గ్రామ సమీపంలో మే నెల 19న సీజ్ చేసిన ఇసుక అక్రమ నిల్వలను అధికారులు వేలం వేశారు. చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు ఎస్సై ఎ.సన్యాసినాయుడు, ఆర్ఐ రామ్‌కుమార్, వీఆర్వో పైడిరాజు సమక్షంలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో తొమ్మిది మంది పాల్గొన్నారు. గొల్లలపాలెంకు చెందిన దువ్వాన రాము టన్ను రూ. 505 చొప్పున మొత్తం 675 టన్నులను రూ. 3,40,875లకు దక్కించుకున్నారు. ఈ మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయనున్నట్లు ఎస్సై సన్యాసినాయుడు తెలిపారు.

త్వరితగతిన 'నాడు-నేడు' పనులు

బొండపల్లి: రెండో విడతలో చేపట్టిన 'నాడు-నేడు' అభివృద్ధి పనులను పాఠశాలలు పునః ప్రారంభమయ్యే నాటికి పూర్తిచేయాలని ఎంపీడీఓ ఎ.వేదవతి ఆదేశించారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు సూచించారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

గజపతినగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎస్.కృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గజపతినగరంతో పాటు పురిటిపెంట, ఎం.వెంకటాపురం, మదుపాడ డెయిరీ, ఎస్‌జీఆర్ పురం లేఅవుట్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఐరిష్ నమోదుతో రేషన్

బొండపల్లి: వేలిముద్రలు పడని రేషన్ లబ్ధిదారులకు ఈ నెల నుంచి ఐరిష్ ఆధారంగా రేషన్ సరుకులు పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్ బుధవారం తెలిపారు. అందుకు అవసరమైన ఐరిష్ పరికరాలను ఎండీయూ ఆపరేటర్లకు అందజేయడం జరిగిందన్నారు.

పొగాకు వినియోగంతో క్యాన్సర్ ముప్పు


దత్తిరాజేరు: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

గజపతినగరం: పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల గొంతు, ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని, ప్రతి ఒక్కరూ పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలని మరుపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సాయికృష్ణారెడ్డి సూచించారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఖైనీ, గుట్కా, ఇతర పొగాకు ఉత్పత్తులను తీసుకోవడం ద్వారా కలిగే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.
దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురంలో పొగాకు వ్యతిరేక ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధూమపానం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆశా కార్యకర్తలు లీలా, ఈశ్వరమ్మ, పద్మ, గౌరి పాల్గొన్నారు.

ముగిసిన వేసవి క్రీడా శిబిరం

శృంగవరపుకోట: పట్టణంలోని కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో నెలరోజులుగా నిర్వహిస్తున్న సమ్మర్ షటిల్ క్యాంప్ బుధవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్సీ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుకూరి రఘురాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడలతో మానసిక వికాసం, శారీక ఆరోగ్యం కలుగుతాయని, విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. 18 ఏళ్లుగా క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న కోచ్ పి.శ్రీరాములును అభినందించారు. అనంతరం పలువురు క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఎఫ్.ఆర్.సి క్లబ్ అధ్యక్షుడు డా.సత్యశేఖర్, స్నేహ స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.ఎస్.వెంకటరావు, మంథా సుబ్బారావు, మళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

భూ ఆక్రమణలు అడ్డుకోండి

శృంగవరపుకోట: ప్రభుత్వ భూములు కబ్జాదారుల పాలవుతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు చూస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణ ఆందోళన వ్యక్తం చేశారు. కబ్జాల పాలవుతున్న ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు తమ స్వాధీనంలోకి తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ శ్రీనివాసరావుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ కొత్తూరు గ్రామంలో రొప్పల అప్పలకొండ ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పాకలు వేశారని, అదే వ్యక్తికి పాతమాలపల్లిలో స్థలం ఉన్నప్పటికీ 2007లో ఎస్సీ కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారని అన్నారు. ఇప్పుడు సదరు వ్యక్తి ఆర్‌బీకే పక్కన ఉన్న స్థలం ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నాడని, దీనిపై రెండు నెలలుగా ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు.

ఇది పేదల ప్రభుత్వం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- అలమండలో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే భవనాలు ప్రారంభం


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పక్కన ఎమ్మెల్యే కడుబండి, ఎమ్మెల్సీ రఘురాజు, నెక్కల నాయుడుబాబు

జామి:

పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, అందుకు అనుగుణంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అలమండ గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.43 లక్షలతో నిర్మించిన రెండు రైతుభరోసా కేంద్రాలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అర్హత ఉన్నా కొందరికి పథకాలు అందేవి కాదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్నామని అన్నారు. అలమండ గ్రామంలో గత నాలుగేళ్లలో రూ.27 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మూసివేశామని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నారని, కానీ చంద్రబాబు హయాంలో ఆ ఫ్యాక్టరీని మూసివేస్తే.. దివంగత వైఎస్సార్ తిరిగి ఫ్యాక్టరీని తెరిపించారని గుర్తు చేశారు. ప్రస్తుతం చెరుకు సాగు విస్తీర్ణం తగ్గడంతో ఫ్యాక్టరీ నడవడం లేదని, చెరకు రైతులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు కృషిచేస్తోందని అన్నారు.

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. అలమండ గ్రామంలో రూ.27 కోట్లతో సీసీరోడ్లు, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి ముంగిటకే చేరవేస్తున్నట్లు చెప్పారు. వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ వాగ్దానాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని అన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌కు పేదలంతా మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె సరయు, పార్టీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, కె.వి.సూర్యనారాయణరాజు, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు గుడివాడ రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ కాకర్లపూడి సూర్యనారాయణరాజు, వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, సర్పంచ్ కోట పాపమ్మ, ఉపసర్పంచ్ లగుడు దేముడు, మండల ప్రత్యేకాధికారి రామ్‌గోపాల్, ఎంపీడీఓ సతీష్, తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఏఓ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి


జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుర్ల: జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణశాఖ అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. మండలంలోని గూడేం జంక్షన్ వద్ద ఉన్న జగనన్న కాలనీని బుధవారం ఆమె సందర్శించారు. ఇళ్ల నిర్మాణాలు, కాలనీలో మౌలిక వసతులను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. అనంతరం మండలంలోని చోడవరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ప్రజలకు సేవలందించడంలో అలసత్వం ప్రదర్శించొద్దని సిబ్బందికి సూచించారు.

రైతులకు మేలు జరిగేలా సర్వే..

గుర్ల: భూముల రీసర్వేతో రైతులకు మేలు జరగాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని చేపడుతున్న భూముల రీసర్వేను బుధవారం ఆమె పరిశీలించారు. భూసర్వే పూర్తయిన వెంటనే ఆయా ప్రాంత రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కెల్లలో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. పని ప్రదేశంలో తప్పనిసరిగా మంచినీరు, టెంట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ అప్పారావు, తహసీల్దార్ సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

త్వరలో ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం


మాట్లాడుతున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు

దత్తిరాజేరు: మండల పరిధిలో నిర్మాణాలు పూర్తయిన ఆరు గ్రామ సచివాలయ భవనాలను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య చేతుల మీదుగా త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు తెలిపారు. మండల పరిషత్‌లోని తన చాంబర్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ..కె.కొత్తవలస, పాచలవలస, ఇంగిలాపల్లి, పోరలి, గదితర గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల భవన నిర్మాణాలు పూర్తయినందున ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పలు గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించనున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్ ఉన్నారు.

ఒకటో తేదీనే పింఛన్ ఇస్తున్న ఏకైక సీఎం జగన్

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: భారతదేశంలో ఒకటో తేదీనే ఇంటి వద్దకు పింఛన్ డబ్బులు పంపిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వీరభద్రపేట గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించే ప్రయత్నం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే గ్రామంలోని ప్రతీ ఇంటికీ పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రతి ఒక్కరూ సంతృప్తిగా ఉన్నారని అన్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుతో ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకొచ్చారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, వైస్ సర్పంచ్ ఏడువాక కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దేసుపాత్రునిపాలెంలో..

కొత్తవలస మండలం దేసుపాత్రునిపాలెంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం 200వ రోజు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత


బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు

లక్కవరపుకోట: ముఖ్యమంత్రి సహాయనిధి పేద, బడుగు వర్గాల పాలిట సంజీవిని అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలో పలువురికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుతో కలిసి బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో లేని వ్యాధులకు, శస్త్రచికిత్సలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీలు గేదెల శ్రీనివాసరావు, తూర్పాటి వరలక్ష్మి, చందులూరు ఎంపీటీసీ యడ్ల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

జామి: మండల కేంద్రానికి చెందిన పల్లంటి శ్రీను, అతని కుమారుడు సూర్య ప్రకాష్‌కు సీఎం సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు మంజూరు కావడంతో ఆ మొత్తాన్ని ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె సరయు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, అల్లు సత్యాజీ, జామి వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భూమి కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలి


కొత్తవలస మండల కేంద్రంలో రైతులు, వామపక్ష నేతల ర్యాలీ

కొత్తవలస: అరుకు–విశాఖ జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రత్యామ్నాయం చూపాలని కోరుతూ సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో రైతులు బుధవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏపీ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బుద్దరాజు రాంబాబు, చల్లా జగన్, డేగల అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు గాడి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో చింతలపాలెం, మంగళపాలెం, మిందివలస, నిమ్మలపాలెం, వీరభద్రపురం తదితర గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొత్తవలస జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా రైతు సంఘం నేతలు మాట్లాడుతూ.. గతంలో చూపించిన విధంగా బైపాస్ రోడ్డు వేయాలని, లేదంటే విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణ, గ్యాస్ పైపులైన్, రైల్వే లైన్ కారణంగా వీరభద్రపురం రైతులు ఇప్పటికే సుమారు 70 శాతం భూములు కోల్పోయారని, ఇప్పుడు జాతీయ రహదారి విస్తరణలో వారికి మరింత నష్టం జరుగుతుందని వాపోయారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


అర్తమూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): ప్రజల కోసం అనునిత్యం ఆలోచన చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని వైఎస్సార్‌సీపీ గరివిడి మండల నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని అర్తమూరు గ్రామంలో బుధవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. నాలుగేళ్లలో ఒక్కో కుటుంబానికి జరిగిన సంక్షేమ లబ్ధిని తెలియజేసే బుక్‌లెట్లు అందజేశారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తోందన్నారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాల నగదును నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. స్థానిక సర్పంచ్ పొన్నాడ కుమార్, ఎంపీటీసీ పతివాడ గురునాయుడు, వైస్ సర్పంచ్ జి.పైడితల్లినాయుడు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములు నాయుడు, కోనూరు పీఏసీఎస్ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, ఎంపీటీసీ కడుమల రాంబాబు, అలమండ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం

గజపతినగరం: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, వైస్ చైర్మన్ ఎం.శ్రీనివాసరావుతో పాటు ఎన్నికైన సభ్యులంతా స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా ఎన్నికైన మార్కెట్ కమిటీ సభ్యులకు గజపతినగరం పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, బొండపల్లి ఎంపీపీ చల్లా చల్లంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాష్ తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ.. మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సహకారంతో మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. తనపై నమ్మకంతో రెండో సారి పదవీ బాధ్యతలు అప్పగించిన మంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు
- వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేత


ఎల్.కోట: వలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


కొత్తవలస: ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లను సన్మానిస్తున్న రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు, తదితరులు

లక్కవరపుకోట, కొత్తవలస, జామి, దత్తిరాజేరు, గంట్యాడ, వేపాడ: గ్రామ వలంటీర్లు ముఖ్యమంత్రి మానస పుత్రికలని, వారి సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. లక్కవరపుకోట, జామి మండలాల్లో సేవలందిస్తున్న వలంటీర్లను బుధవారం ఘనంగా సత్కరించారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు అందించిన సేవలు దేశానికే ఆదర్శమని కొనియాడారు. వారి సేవలను గుర్తించి ప్రభుత్వం ఏటా సేవా పురస్కారాలతో సత్కరిస్తోందన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా అందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. కొత్తవలస మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు వలంటీర్లను సత్కరించారు.

- దత్తిరాజేరు మండలం వంగర, వి.కృష్ణాపురం గ్రామ వలంటీర్లను ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి సన్మానించారు.
- గంట్యాడ మండల కేంద్రంలో ఎంపీపీ పీరుబండి హైమావతి వలంటీర్లను ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలు అందించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని వలంటీర్లకు సూచించారు. వేపాడలో డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, తదితరులు వలంటీర్లకు సేవా పురస్కారాలు అందజేశారు.


జామి: అలమండలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కడుబండి, ఎమ్మెల్సీ రఘురాజు


దత్తిరాజేరు: వంగరలో వలంటీర్లకు సన్మానం చేస్తున్న నాయకులు


గంట్యాడ: వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ హైమావతి


వేపాడలో వలంటీర్లుకు సేవా పురస్కారాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

సంక్షిప్తంగా...

ఘనంగా త్రిపురాంతకస్వామి కల్యాణం

జామి: మండల కేంద్రంలోని మూడు ఆలయాల ప్రాంగణంలో త్రిపురాంతక స్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి కల్యాణాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జేష్టశుద్ధ ఏకాదశి సందర్భంగా అర్చకులు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అనంతరం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

వేపాడ: మండలంలోని బానాది శివాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామపెద్దలు, గ్రామస్తుల సహకారంతో అర్చకులు మేడపాటి కిశోర్ శర్మ, రోహిత్ శర్మ, విష్ణు శర్మ వేదమంత్రోచ్ఛరణలతో స్వామివారికి అభిషేకాలు, అష్టోత్తర శతనామ పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

సీతారామ ఆలయ ప్రతిష్ఠ

జామి: మండల కేంద్రంలోని మాధవరాయిమెట్ట కాలనీ వద్ద టీటీడీ, శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహకారంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సీతారామ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం సుమారు 2వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు.

వైభవంగా వాసవీమాత ఆలయ వార్షికోత్సవం

గజపతినగరం: మండల కేంద్రంలోని సీతారామ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఉన్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ 62వ వార్షికోత్సవం బుధవారం ప్రారంభమైంది. తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు వేదుల భువనేశ్వర్ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు గంగవరపు వంశీకృష్ణ వాసవీమాత అమ్మవారికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి లక్ష కుంకుమార్చన, దీపోత్సవం నిర్వహించగా..పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జామి: మండలంలో భీమసింగి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. సింహాచలం దేవస్థానం వేదపండితులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ముగిసిన గ్రామదేవత పండగ

జామి: మండలంలోని గొడికొమ్ము గ్రామంలో మూడురోజులుగా నిర్వహించిన గ్రామదేవతల ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. పైడితల్లమ్మ, బంగారమ్మ అమ్మవార్లకు మంగళవారం రాత్రి గ్రామవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవార్లకు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు చూపించి మొక్కులు చెల్లించారు. పండగల సందర్భంగా బంధుమిత్రులు, స్నేహితులతో గ్రామం కళకళలాడుతూ కనిపించింది.

ప్రమాదకరంగా మారిన గోతులు

కొత్తవలస: మండల కేంద్రం నుంచి విజయనగరం రోడ్డులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో రోడ్డు పక్కన ఉన్న గోతులు ప్రమాదకరంగా మారాయి. టెలికాం కేబుల్స్ వేసేందుకు గోతులు తవ్వారని, అనంతరం వాటిని సరిగా పూడ్చకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. బుధవారం ఇదే మార్గంలో ప్రయాణిస్తున్న ఓ ద్విచక్రవాహన చోదకుడు ప్రమాదవశాత్తు ఈ గోతిలో పడిపోయి గాయపడగా.. వాహనం గోతిలో చిక్కుకుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.